

నేతాజీ విగ్రహావిష్కరణ

నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం, జెడ్పీ చైర్మన్

పాచిపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, జెడ్పి చైర్మన్ ఎం.శ్రీని వాసరావు ఆదివారం ఆవిష్కరించారు. పాచిపెంటకు చెందిన పంచాది కృష్ణారావు తల్లిదండ్రులు పివి చలపతిరావు, మాలతి జ్ఞాపకార్థం పాఠశాలకు ఈ విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో 1993-94 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు కూడా పాల్గొని సహాయ సహకారాలు అందించారు.

గిరిజన మంత్రి అంటే..

అంత అలుసా?

- డిప్యూటీ సిఎంను పట్టించుకోని అధికారులు
- నూతన సంవత్సర శుభాకాంక్షలు కూడా తెలపని మన్యం బాస్‌లు
- విస్మయం వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లయింది. డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర పదవీ బాధ్యతలు చేపట్టి అర్ధ సంవత్సరం దాటిపోయింది. ఆయన డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి కొత్త సంవత్సరం వచ్చింది. సాధారణంగా మంత్రి స్థానంలో ఎవరున్నా సంబంధిత జిల్లా, ఇరుగుపొరుగు జిల్లాల అధికారులు నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పడానికి వస్తారు. రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి. అంటే రాష్ట్రంలోని ఏడు ఐటిడిఎలకు ఆయనే సుప్రీం. ఐటిడిఎల ద్వారా ఏ ఫైలు కదలాలన్నా సంబంధిత మంత్రి కనుసన్నల్లోనే కదులుతుంది. అయితే వారం రోజుల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో కొత్త సంవత్సరం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మన్యం జిల్లాకు చెందిన బాసులెవరూ మంత్రి రాజన్నదొరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి రాకపోవడం చర్చనీయాంశమైంది.

ప్రజాశక్తి- సాలూరు

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పట్టణంలోని డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసానికి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఏడు ఐటిడిఎ ప్రాజెక్టులకు సంబంధించిన పిఒలు, డిడిలు, ఎటిడబ్ల్యుఒలు హాజరవుతారని పార్టీ నాయకులు కార్యకర్తలు భావించారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతో మన్యం జిల్లా అధికార యంత్రాంగమంతా కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పడానికి వస్తారని భావించారు. కానీ మన్యం జిల్లాకు సంబంధించిన కలెక్టర్, ఎస్‌పిలే కాకుండా ఏ ఒక్క ఐటిడిఎ పిఒ కూడా హాజరు కాకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చకు తెరలేపింది. గిరిజన మంత్రి పట్ల అధికారులు ఇంత చులకనగా వ్యవహరిస్తారా? అన్న చర్చ సాగుతోంది. గతేడాది జనవరి ఫస్ట్‌కు డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఉన్నారు. ఆమె పదవిలో సమయంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, ఉమ్మడి జిల్లా కలెక్టరూ ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అటు మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు మరో మంత్రి పుష్పశ్రీవాణికీ అదే స్థాయిలో శుభాకాంక్షలు చెప్పడానికి పరుగులు తీశారు. జిల్లా విభజన తర్వాత కనీసం మన్యం జిల్లా అధికారులైనా జిల్లా మంత్రి రాజన్నదొరకు శుభాకాంక్షలు చెప్పడానికి హాజరు కావాల్సి ఉంది. కానీ కీలకమైన అధికారులెవరూ మంత్రి రాజన్నదొర వైపు కనీసం కన్నెత్తి చూడలేదు. దీనికి ప్రధాన కారణం ఏమిటనే చర్చ మొదలైంది. రాష్ట్ర మంత్రి వర్గం లో సిఎం జగన్ మోహన్ రెడ్డి తర్వాత ఉన్న ముగ్గురు డిప్యూటీ సిఎంల్లో రాజన్న దొరే మొదటి ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. మంత్రిగా ఆయన అధికారాలను అనుభవించకుండా పార్టీలో కొంతమంది కీలక నేతలు అడ్డు తగులుతున్నారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

మంత్రి హోదాలో ఉన్న రాజన్నదొరకు కనీస ప్రోటోకాల్ మర్యాదలు కూడా పాటించకుండా పార్టీలో కీలక నాయకులు పని చేస్తున్నారేమోనని గుసగుసలాడుకుంటున్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏనాడూ ఒక గిరిజన సంక్షేమశాఖ మంత్రికి జరగని విధంగా అవమానం ప్రస్తుతం రాజన్నదొరకు ఎదురవుతోందని ఆయన సన్నిహితులు మదనపడుతున్నారు. రాజన్నదొర జిల్లా అధికారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం కూడా వారి వివక్షా పూరిత వైఖరికి కారణమై ఉండొచ్చునని తెలుస్తోంది. పార్వతీపురం ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సిహెచ్.విష్ణుచరణ్ ఇంతవరకు కనీసం మర్యాద పూర్వకంగానైనా సంబంధిత శాఖా మంత్రి రాజన్నదొరను కలవలేదనే చర్చ నడుస్తోంది. కనీసం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి కూడా మన్యం జిల్లా పరిధిలో ఉన్న పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు కూడా హాజరు కాలేదు. తాజా పరిణామాలపై అధికార పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలలో విస్తృత చర్చ జరుగుతోంది.

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

సావిత్రిబాయి జయంతి వేడుకల ముగింపు సభలో వక్తలు

బొబ్బిలి.. సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, యుటిఎఫ్, ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణకు పోరాటం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు శారదారాణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల ముగింపు సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యారంగంలో అనేక మార్పులకు దోహదపడిన సావిత్రిబాయి పూలే సమాజంలో మార్పు కోసం కృషి చేశారని తెలిపారు. ఆమె ఆశయాలను ప్రస్తుత ఉపాధ్యాయులు కొనసాగించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం అమలుకు పూనుకుని విద్యారంగాన్ని నేడు ఛిన్నాభిన్నం చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. సావిత్రిబాయి విద్యలో అంతరాలు పోవాలని కృషి చేస్తే, నేటి పాలకులు అంతరాలను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్ఇపి అమలుతో ఆడపిల్లలు చదువుకు దూరమవుతారని ఆందోళన చెందారు. మరింత డ్రాపవుట్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ విధానాలను అడ్డుకోవడమే సావిత్రిబాయికి నిజమైన నివాళులని పేర్కొన్నారు. అనంతరం యుటిఎఫ్ విజయనగరం, మన్యం జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, రాజామణి, జ్యోతి, ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి మాట్లాడారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొబ్బిలి గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆ పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య గైడ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కేశవరావు, నాయకులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జెడ్‌పి మినిస్టీరియల్ హాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల ముగింపు సభను యుటిఎఫ్ జిల్లా మహిళా సబ్ కమిటీ కన్వీనర్ వి.రాధా భవాని అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో అందరికీ సమాన విద్య కోసం పాటుపడాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు సత్య శ్రీనివాస్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శి అల్లు శంకర్రావు, రాష్ట్ర కౌన్సిలర్ డి.రాము, కె.శ్రీదేవి, జిల్లా మహిళా కమిటీ కోకన్వీనర్లు మాధవి లత, పద్మ, రూపావతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మాయ' పుస్తకావిష్కరణ

మాయ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రముఖ ఉత్తరాంధ్ర కథకుడు, రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన మాయ పుస్తకాన్ని ఆదివారం స్నేహకళాసాహితీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవిజిఆర్ కృష్ణాజీ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించగా ఆల్తి మోహన్ పుస్తక పరిచయం చేశారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో కష్టాలు, కన్నీళ్లు, సమస్యలు సహజీవనాన్ని మాండలిక భాషలో కళ్లకు కట్టిన రచయిత గౌరునాయుడు అని కొనియాడారు. స్థానిక సమస్యలపై ప్రజలకు ప్రశ్నించేతత్వం అలవాటు కావాలన్నారు. ఇక్కడి సమస్యలపై ఇతర ప్రాంతాల్లో వారు స్వార్థ రాజకీయాల కోసం సభలు పెట్టి మాట్లాడటం దురదృష్టం అన్నారు. భవిష్యత్‌లో స్నేహకళాసాహితీ ద్వారా మరింత మంది కొత్త రచయితలు తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు, వ్యాపార వేత్త బరాటం గుంపసోమేశ్వరరావు, రచయితలు ఎన్‌కె బాబు, మల్లిపురం జగదీష్, చింత అప్పలనాయుడు, సిరికి స్వామి నాయుడు, పక్కి రవీంద్రనాథ్, స్నేహకళాసాహితీ సభ్యులు రామకష్ణ, జగదీష్, శ్రీనివాస్, కృష్ణ, గంగాధర్, వెంకటరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సిల సమస్యల పరిష్కారానికి కమిషన్

ఎస్‌సి రాష్ట్ర కమిటీ సభ్యులు జయమణి

ప్రజాశక్తి - సీతానగరం

ఎస్‌సిలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం దిశగా ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని ఎస్‌సి రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి అన్నారు. మండలంలోని పెదభోగిలి ఆమె స్వగృహంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎస్‌సిలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు ఉంటే సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సమస్యలపై స్పందించి పరిష్కరించామన్నారు. రానునన అసెంబ్లీ ఎన్నికల కోసం వైసిపి తరపున పార్వతీపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు టిక్కెట్ కోసం పార్టీ పెద్దలకు దరఖాస్తులు చేస్తున్నామని ఆమె తెలిపారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉందని, ప్రజలకు మరింత సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, రాష్ట్రమంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు పనిచేశానని, అలాగే అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ నిర్ణయాల మేరకు కట్టుబడి ఉంటానని ఆమె తెలిపారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు ఎం.మాధవరావు, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 1ను రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిఒ నెంబర్ 1 నిర్బంధ, చీకటి జీవో అని, దీన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాలు, వామపక్షాలు డిమాండ్ చేశాయి. జిఒ రద్దు కోరుతూ ఈనెల 10న కలెక్టర్‌కు వినతిని అందజేయాలని, దశలవారీగా ఆందోళనకు చేసేందుకు సమావేశం తీర్మానించింది. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన ప్రజా సంఘాలు, రాజకీయ, వామపక్ష పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసికొచ్చిన జీవో 1 ప్రజాస్వామ్యకులపై నిర్బంధంగా ఉన్న చీకటి జీవోఅని, ఈ జిఒలో రహదారులు, వీధుల్లో సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని పేర్కొందన్నారు. సుప్రీంకోర్టు విచారించి వివరణ ఇచ్చిన 18 61 పోలీస్ చట్టం సెక్షన్ 3 ఇచ్చిన అధికారాలతో సెక్షన్ 30 ప్రకారం నిర్బంధాన్ని

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

తీసుకురావడం పోరాడే శక్తులు, ప్రజాసామిక శక్తులు గొంతునొక్కడమేనని అన్నారు. ఇలాంటి జిఒను వెంటనే రద్దు చేయాలని, జిఒ రద్దయ్యే వరకూ అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు దశలవారీగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఏదో ఒక కారణంతో ప్రశ్నించే వారి గొంతునొక్కి పౌర హక్కులపై నిర్బంధంగా తీసుకురావడం సరైన చర్య కాదన్నారు. హక్కులను కాలరాసే జీవో 1ని వెంటనే రద్దు చేయాలని దశల వారీ పోరాటంలో భాగంగా ఈనెల 10న కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వాలని, ఆందోళన, పోరాటం చేయాలని నాయకులు తీర్మానించారు. సమావేశంలో సిపిఐ, ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవరత్నం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెలగాడ కృష్ణ, నర్సింగరావు, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు భాస్కర రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గౌరీ నాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, డివైఎఫ్ఐ, లాయర్ల సంఘం వెంకటరమణ, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర పాల్గొన్నారు

వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి

- టెన్త్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక
- 'ప్రజాశక్తి'తో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ ముఖాముఖి

జిల్లాలోని బిసి హాస్టళ్లలో విద్యార్థుల కోసం మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ తెలిపారు. హాస్టళ్ల అభివృద్ధిగా భాగంగా జిల్లాలోని 9 వసతిగృహాల అభివృద్ధికి నాడు-నేడు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రానున్న టెన్త్ పరీక్షల్లో నూరుశాతంఉత్తీర్ణత సాధించేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని విద్యార్థులకు ఆవిధంగా తర్ఫీదును ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో బిసి వసతిగృహాల పరిస్థితులు, విద్యాభివృద్ధిపై ప్రజాశక్తి ముఖాముఖితో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

-ప్రజాశక్తి, కలెక్టరేట్

జిల్లాలో ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి?

జిల్లాలో 17 బిసి వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 11 వసతిగృహాలు ప్రీ మెట్రిక్ విద్యార్థుల కోసం కేటాయించాం. ఈ వసతి గృహాల్లో మూడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వసతి, భోజనం సదుపాయం కల్పిస్తున్నాం. మిగిలిన ఆరు పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో ఇంటర్ నుంచి డిగ్రీ చదువుకునే విద్యార్థులకు వసతి, భోజనం సదుపాయం కలిస్తున్నాం.

ఈ హాస్టళ్లలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?

జిల్లాలో 893 మంది విద్యార్థులు వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో ఉన్నారు. వీరిలో 767 మంది బాలురు, 126 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 671 మంది విద్యార్థులు ప్రీమెట్రిక్, 222 మంది విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో వసతి పొందుతున్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

వసతిగృహాల్లోని విద్యార్థులకు ప్రతినెలా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం.

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గతేడాది 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత 85 శాతం సాధించగా, ఈ సంవత్సరం 100శాతం సాధించడం కోసం కృషి చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆంగ్లం, సైన్స్, గణితం వంటి సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధిస్తున్నాం. అలాగే స్టడీ అవర్స్‌ను కూడా పక్కగా ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నాం.



అలాగే ప్రతి రెండు నెలలకు ఒకసారి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల పురోగతిని, వారి సమస్యలను వివరిస్తూ తల్లిదండ్రుల వద్ద నుంచి, వారి స్పందన కూడా పరిగణలోకి తీసుకొని అందుకు తగినట్లుగా విద్యార్థుల ఆరోగ్యం, చదువు, ప్రవర్తనపై తగిన సూచనలను పరిగణలోకి తీసుకొని అమలు చేస్తున్నాం.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే నాడు నేడు నిధులతో తొమ్మిది వసతి గృహాల్లో మౌలిక వసతుల మెరుగుపరచడానికి ఎంపిక చేశాం.

చెరకు రైతుకు చేదు

- పెరుగుతున్న మదుపులు
- తగ్గుతున్న దిగుబడి

ఫ్యాక్టరీకి తరలించేందుకు సిద్ధంగా ఉన్న చెరకు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

చెరుకు సాగుచేస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. చెరుకు తీపిని పండిస్తున్న రైతులు వారు మాత్రం చేదు అనుభవాలు చవిచూస్తున్నారు. ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో వేరే గత్యంతరం లేక సాగు చేస్తున్నారు. మండలంలో గోపాలపురం, యరకారాయపురం, చినమంగళాపురం, గొట్టమంగళాపురం, అంపిలి, అన్నవరం గ్రామాల్లో చెరుకు సాగుచేస్తున్నారు. మండలంలోని సుమారు 2వేల ఎకరాల్లో చెరకు సాగవుతుంది. గతంలో 5వేల ఎకరాల వరకు చెరుకు సాగయ్యేది. అయితే గత మూడేళ్ల నుంచి చెరుకు సాగుపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో దిగుబడి తగ్గుతూనే ఉంది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులకు నష్టాలే మిగులున్నాయి. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందక పక్కనే ఉన్న సంకిలిలో చక్కెర కర్మాగారం నుంచి సరైన రాయితీ రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రతి ఏటా చెరుకు పండించిన రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

చెరుకు రైతులకు ఆర్థిక ఇబ్బందులు....

మండలంలో చెరుకు సాగుచేస్తున్న రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. టన్ను చెరుకు మద్ధతు ధర రూ.2,980 ఫ్యాక్టరీ ప్రకటించగా, అంతకు మించి పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. చెరకు కోతకు టన్నుకు సుమారు రూ.500 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తుండగా రవాణా ఛార్జీ కూడా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో ఫ్యాక్టరీ కూడా కటింగ్ ఆర్డర్లు ఇవ్వక పోవడంతో కటింగ్ ఆర్డర్లు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. పెట్టుబడుల భారం తప్ప లాభం రాకపోవడంతో చెరుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరుకు పంట ఫ్యాక్టరీకి అప్పగించిన నెలరోజుల వరకూ రైతుల ఖాతాల్లో సొమ్ము కూడా జమ చేయకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



చెరుకు పంట సాగుచేస్తున్నాం. అయినా ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్థికంగా నష్టపోతున్నాం. సంకిలి కర్మాగారం నుంచి ఎరువులు సరఫరాకు అధిక మొత్తంలో డబ్బులు చెల్లిస్తున్నాం. మద్ధతు ధర గిట్టుబాటు కావడం లేదు. దీనివలన ఇబ్బందులు పడుతున్నాం.

ఇనుమల అప్పారావు, రైతు

సాగు ఆపేయాలనుకుంటున్నాం

ప్రతి ఏటా నష్టాల ఊబిలో చిక్కుకుంటున్నాం. చెరుకు పంట సాగువల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. దీంతో చెరుకు పంట సాగుపై ఆసక్తి తగ్గుతుంది. వచ్చే ఏడాది నుంచి నిలిపివేయాలనుకుంటున్నాం. ప్రభుత్వం, కర్మాగారం సహాయంగాని లేదు. ఎంత కాలం ఇలా అప్పులు పాలై సాగు చేస్తాం. అందుకే రానున్న ఏడాది నుంచి చెరుకుసాగు చేయకూడదనుకుంటున్నాం.

మజ్జి సత్యనారాయణ, రైతు

రాష్ట్రస్థాయి క్రీడల్లో గిరిజన యువత ప్రతిభ

ప్రజాశక్తి - కురుపాం

గుంటూరులో ఈనెల 6,7 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని జి.శివడ పంచాయతీ జి.శివడకు చెందిన గిరిజన యువత బిడ్డిక బాలరాజు ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ పతకాలను కైవసం చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన బిడ్డిక క్వారా బంగారు పతకం కైవసం చేసుకోగా, కుంబిరిక మోహన్‌రావు, ఆరిక సోనీ వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామంలో మేము నివసిస్తున్నామని, మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడం వల్ల అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎక్కడ క్రీడలు జరిగినా తాము సొంతంగా డబ్బులు పెట్టుకొని వెళ్లడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కావున క్రీడలపై ఆసక్తి ఉన్నటువంటి మాలాంటి గిరిజన యువతకు ఐటిడిఎ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆర్థికపరంగా మమ్మల్ని ఆదుకుంటే ఇకపై జరగబోయే క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తామని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పతకాలు సాధించిన గిరిజన యువకులు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి బొమ్మాళి భాను అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ డొంక త్రినాధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నందున అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ : పట్టణంలోని వెంకంపేట వాటర్ ట్యాంక్‌కు నగర పంచాయతీ ద్వారా అందించే తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనందని కమిషనర్ సర్వేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంకిలిలో గల పంపింగ్ పైప్ లైన్ మరమ్మతులకు గురైనందున ఆ ట్యాంక్ పరిధిలో గల 1, 2,10,11,12,18,19,20 వార్డులకు ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వరకు నీటి సరఫరా రాదని పేర్కొన్నారు. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయని, మరమ్మతులు అనంతరం నీటిసరఫరా ఇవ్వగలమని, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ పట్టణవాసులకు విజ్ఞప్తి చేశారు.

ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు ఇందు, నాగమణి

ఐద్వా జెండా ఆవిష్కరణ

సాలూరు: సమానత్వమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు టి.ఇందు, నాగమణి కోరారు. ఆదివారం స్థానిక ఐద్వా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళలోని తిరువనంతపురంలో 13వ ఐద్వా జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

లలిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

కురుపాం : మండలంలోని వలసబల్లేరుకు చెందిన పాలక లలిత (34) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, మాజీ ఎంపిపి ఇందిరకుమారి, మొండెంఖల్ ఎంపిటిసి సభ్యులు జి.విద్యారాణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువునాయుడుపేటలో గడపగడపకు...

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గురువునాయుడుపేటలో మూడో రోజు ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. డిప్యూటీ సిఎం పి..రాజన్నదొర గ్రామంలోని వీధుల్లో పర్యటించి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేస్తే వాటిని సంబంధిత అధికారులకు వివరించి తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారులి. కార్యక్రవంలో పలువురు ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు, నాయకులు, అధికారులు, సచివాల సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతానగరం : మండలంలోని గుచ్చుమిలో ఆదివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇంకా అర్హులైన పేదలు ఉంటే వారికి అందించడానికి ప్రయత్నిస్తుందన్నారు. అంతే కాక సమస్యను అక్కడికక్కడ పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిటిసి సభ్యులు చల్లావు జగదీష్, సర్పంచ్ మరో శ్రీదేవి, వైసిపి నాయకులు బి.శ్రీరాములు నాయుడు, శంకర్రావు, ఎం.మన్మధరావు, ఎం.ధనుంజయ నాయుడు, బి.చిట్టిరాజు, బి.సూర్య నారాయణ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామస్తులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నేడు అట్టలిలో గడపగడపకు మన ప్రభుత్వం

పాలకొండ రూరల్: మండలంలోని వాటపాగు సచివాలయం పరిధిలో అట్టలిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ డొంక త్రినాధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి అట్టలి గ్రామంలో జరగబోయే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే వి. కళావతి, ఎమ్మెల్సీపాలవలస విక్రాంత్ హాజరుకానున్నట్టు తెలిపారు.

వృద్ధురాలికి బంగారు వస్తులు, సామాగ్రి అందజేస్తున్న రైల్వే స్టేషన్ మాస్టర్

ప్రమాదం నుంచి వృద్ధురాలిని కాపాడిన రైల్వే పోలీసులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక రైల్వే పోలీస్ అధికారులు ఓ వృద్ధురాలిని ప్రమాదం నుంచి రక్షించారు. ఆమె బంగారు నగలతో పాటు లగేజీని అందించి రైల్వే స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు అప్పగించారు. ఆదివారం బెలగాం, టౌన్ రైల్వే స్టేషన్ లో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ నుండి వచ్చే బొకారో అలెప్పి రైలులో విజయవాడ నుంచి కోలా కాసులమ్మ అనే వృద్ధురాలు నాలుగు మూటలు లగేజీతో బెలగాం రైల్వే స్టేషన్‌లో దిగేందుకు ప్రయత్నించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులతో బొకారో రైలు విపరీతమైన రద్దీగా ఉండడంతో ఆమె లగేజీతో దిగేందుకు ఇబ్బంది పడింది. ఈ తరుణంలో జనసేన నాయకులు వి.దాలినాయుడు ఆమె లగేజీ సగం దించే సమయానికి రైలు బండి కదిలిపోవడంతో ఆమె రైలు నుంచి గెంతేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమెకు నచ్చజెప్పి వెక్కి ఉంచారు. బెలగాంలో దించిన లగేజీలో బంగారు ఆభరణాలు ఉన్నాయంటూ రోధించడంతో స్టేషన్ మాస్టర్ స్పందించి టౌన్ రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే పోలీస్ అధికారి టి.రత్నాకర్‌కు సమాచారాన్ని అందజేశారు. టౌన్ స్టేషన్‌లో కూడా మిగిలిన లగేజీతో ట్రైన్ కదిలిపోయే సమయంలో దూకేందుకు ప్రయత్నించిన వద్ధురాలిని రత్నాకర్ చాకచక్యంగా కిందకి దించి ప్రమాదం నుండి రక్షించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి టౌన్ రైల్వే స్టేషన్ నుండి బెలగాం రైల్వే స్టేషన్ తీసుకువచ్చి ఆమె లగేజీని, బంగారు ఆభరణాలను అప్పగించారు దీంతో వృద్ధురాలు సంతోషించింది. ఈ సందర్భంగా వృద్ధురాలిని కాపాడిన రైల్వే అధికారులను స్థానికులు అభినందించారు.

లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న సర్పంచ్ మన్మథరావు

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

కురుపాం : గ్రామానికి కొత్తగా మంజూరై 32 పింఛన్లను వాలంటీర్లతో కలిసి మండలంలోని నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మధరావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాలంటీర్లు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాలువలో బండ రాళ్లు... స్తంభించిన మురుగునీరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాలువలో బండరాళ్లు ఇలా అయితే కాలువలో మురుగునీరు వెళ్లేది ఎలా అని పట్టణంలోని 26వ వార్డులో గల పండా వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.63 కోట్ల 63 లక్షలతో ఎఐఐబి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో సమగ్ర తాగునీరు పథకం ద్వారా పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. సంబంధిత కాంట్రాక్టర్ కొన్ని రోజులుగా చేపడుతున్న ఈ పనుల్లో భాగంగా పైప్ లైన్లు వేసేందుకు పండా వీధిలో గల సిసి రోడ్డును జెసిబితో తవ్వి పైపులు వేసి గోతులను కప్పే క్రమంలో పెద్ద పెద్ద బండ రాళ్లు మురుగు కాలువలో పడ్డాయి. వీటిని తొలగించకపోవడంతో మురుగునీరు వెళ్ళేందుకు అవకాశం లేకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కాలువలో పేరుకుపోయిన బండరాళ్లు

పండగ రోజులు కావస్తుండడంతో నివాస గృహాల్లో వాడుక నీరు ఎక్కువయ్యే అవకాశం ఉందని, దీనివల్ల వారికి నీరు రహదారిపై వచ్చే అవకాశం ఉందని, యుద్ధ ప్రాతిపదికన సంబంధిత కాంట్రాక్టర్ గానీ, మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు గానీ స్పందించి ఈ రాళ్లను తొలగించి మురుగునీరు వెళ్లేందుకు మార్గం సుగమం చేయాలని ఆ వీధి స్థానికులు కోరుతున్నారు.



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు రోజు కావడం, అందులో నూతన సంవత్సరం కావడంతో జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేశారు. జలవిహార్ వద్ద బోటుషికార్లు చేశారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

చురుగ్గా సాగుతున్న జిసిసి భవనం పనులు

చురుగ్గా జిసిసి భవన నిర్మాణాలు

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో రూ.20 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న జిసిసి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న భవనం 60 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఉద్యోగులు క్షణక్షణం... భయం భయంతో విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సమస్యలను గుర్తించి సంబంధిత జిసిసి ఉన్నతాధికారులు నూతన భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. త్వరితగతిన పనులు పూర్తయితే ఉద్యోగులు విధులకు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు.

రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పండి : శత్రుచర్ల

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని టిడిపి సీనియర్ నాయకులు శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. మండలంలోని తురక నాయుడువలసలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయరామరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందన్నారు. నిత్యవసర వస్తువులు కరెంట్ చార్జీలు, గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచి పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. రాబోవు ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుపొందడానికి ఇప్పటి నుంచే అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జగదీశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. సకాలంలో రైతు పండించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వారు తీవ్ర నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల అధ్యక్షులు పళ్ళ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి లంక గోపాలం, నాయకులు శ్రీరామ్మూర్తినాయుడు, కృష్ణబాబు, సత్యం నాయుడు తురక నాయుడువలస సర్పంచ్ పి సునీత, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పార్వతీపురం రూరల్: పేదల పింఛన్ల తొలగింపు వంటి చర్యలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల నుంచి ముఖ్యమంత్రి జగన్‌పై తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మండలంలోని జమ్మిడివలస పంచాయతీ వీరభద్రపురంలో ఆదివారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.250 పింఛన్ పెంచుతూ రాష్ట్రంలో రెండు లక్షల 50 వేల మంది పింఛన్లు తొలగించి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. తమ హయాంలో అన్ని వర్గాలకు సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫాలను అందించామని, ఇప్పుడు కనీసం కందిపప్పు, పంచదారకే దిక్కులేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జగనన్న ప్రభుత్వం పెన్షన్ ఏరివేత కానుకగా ఇచ్చినందుకు అవ్వా, తాతలు మండిపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, మహం దాత నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : జమ్మిడివలసలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

జియ్యమ్మవలస : తురకనాయుడువలసలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

భామిని : కళ్లాల్లో కదలని ధాన్యంతో దయనీయంగా రైతుల పరిస్థితి ఏర్పడిందని ఇదేమి ఖర్మ రైతాంగానికి అంటూ టిడిపి నాయకులు పడాల భూదేవి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఆదివారం పెద్దదిమిలిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల కల్లాల్లో ధాన్యం నిల్వలను చూసి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదంతా కష్టించి పండించిన పంటకు ఇంత హీనమా అంటూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ప్రభుత్వ నిభంధనలు రైతుల కాళ్లకు బంధాలుగా మారాయన్నారు. సంక్రాంతి వేళ రైతులు ఉసూరుమంటే ఆ ఉసురు పాలకులకు తగులుతోందని దుయ్యబట్టారు. ఏదిఏమైనా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన అవసరముందని అన్నారు. నాణ్యతా ప్రమాణాల షాకు, ట్రక్ సీటు జనరేటు చేయకపోవడం, గోనెసంచులు, రవాణా వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే కొనుగోలు చేసిన రైతులకు త్వరిగతిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రధానరహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న యువకులు

సెంటరు గూడలో యువత శ్రమదానం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురం పంచాయతీ సెంటరుగూడలో యువత, గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఆదివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ తెలిపారు. గ్రామానికి సమీపానున్న కేదారిపురం, గుమ్మలక్ష్మీపురం ప్రధాన రహదారి సమీపాన ఇళ్ల పరిసరాలు ఆవరణలో పేరుకుపోయిన చెట్లు, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించి శుభ్రపరచారు. తమ పరిసరాలను ప్రజలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యువత, ప్రజలను పలువురు అభినందించారు.

వంగరలో కందికొత్త పండగ పూజలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మారుమూల పంచాయతీ కేంద్రమైన వంగరలో ఆదివారం కందికొత్తల పండుగ వేడుకలను గిరిజనులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి గ్రామ దేవతకు పూజలు నిర్వహించారు. పంటలు పుష్కలంగా పండాలని, పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన గ్రామం, గిరిజన బతుకులు బాగుపడాలంటే మళ్లీ టిడిపి అధికారంలోకి రావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బిడ్డిక సుధా ఉన్నారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న టిడిపి నాయకులు పద్మావతి

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

సంక్రాంతి పండగకు దూర ప్రాంతాల నుండి జిల్లాకు వచ్చేవారికి సాధారణ చార్జీలతో ఆర్‌టిసి ప్రత్యేక అల్ట్రా డీలక్స్ నడుపుతున్నట్లు ఎస్‌కోట డిపో మేనేజర్ కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్ కోట డిపో నుండి విశాఖ మీదుగా హైదరాబాద్, హైదరాబాదు నుండి విశాఖ, విజయనగరానికి ఆల్ట్రా డీలక్స్ బస్సులు ఈనెల 11, 12, 13, తేదీలలో సాధారణ చార్జీలతో నడుపుతున్నామన్నారు. విశాఖపట్నం నుంచి ఎస్‌కోట, అరుకు వైపు వచ్చే ప్రయాణికుల కోసం కొన్ని స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. పండగ తర్వాత 16, 17 తేదీలలో బస్సులను మళ్లీ హైదరాబాద్‌కు నడుపుతామని డిమాండ్‌ను బట్టి మరో రెండు రోజులు పొడిగించే అవకాశం ఉందని ఆయన అన్నారు. పండుగ రోజులలో అప్ అండ్ డౌన్ టిక్కెట్లు ఒకేసారి ఆన్‌లైన్‌లో తీసుకున్న ప్రయాణికులకు 10 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. సీనియర్ సిటిజనులకు టికెట్ చార్జీలో 25శాతం రాయితీ ఉంటుందన్నారు. ప్రయాణికులు ఈ స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని తిప్పలవలస సముద్రం తీరానికి ఆదివారం మృతదేహం కొట్టుకొచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహన్ని పరిశీలించగా ఆయన దగ్గర ఉన్న కార్డులు ప్రకారం చీపురపల్లి మండలం కాసా శ్రీనివాసరావు (27) గా గుర్తించారు. విషయాన్ని కుటుంబీకులుకు తెలియజేశారు. ఉద్యోగం లేదన్న బాధతో నాలుగు రోజులు క్రితం ఇంటి నుండి వచ్చేసాడని కుటుంబ సభ్యులు చెబుతన్నారు. శ్రీనివాసరావు కనిపించకపోవడంతో చీపురపల్లి పోలీసుస్టేషన్‌లో శనివారం మిసింగ్ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఆదివారం ఉదయం మృతదేహంగా సముద్రంలో బయటపడ్డాడని చెబుతున్నారు. పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువశక్తి సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఈనెల 12న నిర్వహించనున్న యువశక్తి సభ విజయవంతం చేయాలని యువశక్తి సభ ప్రచారకర్త ముమ్మడివరం నియోజకవర్గం ఇంచార్జి పితాని బాలకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యువశక్తి సభ సన్నద్ధ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది నాయకులు స్వలాభమే ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి కారణమన్నారు. ఇక్కడ యువత అధికంగా ఉన్నా వారిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడన్నారు. లక్షలు ఉద్యోగాలంటూ యువతిని మోసం చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. ఉత్తరాంధ్ర అబివృద్దే అధినేత పవన్‌కళ్యాణ్ ద్యేయమన్నారు. లోకం మాదవి మాట్లాడుతూ యువత పవరేంటో ఈ ప్రాంతామంతా తెలిసేలా సభకు యువతను తరలించాలన్నారు. సమావేశంలో లోకం ప్రసాద్, ఉత్తరాంధ్ర రీజనల్ కమిటీ మెంబర్ తుమ్మి లక్ష్మీరాజ్, మండల నాయకులు శివ, బూర్లె విజయశంకర్, అప్పలరాజు, జానకీరామ్, పతివాడ అచ్చుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో జనసేన మండల అధ్యక్షుల పతివాడ అచ్చుంనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి యువశక్తి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకుల పితాని బాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 12న జరగనున్న సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకం మాదవి, మొయిద లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.